క్లుప్తంగా

అలింకో క్యాంపునకు లబ్ధిదారుల నమోదు


పేర్ల నమోదులో పిల్లలతో తల్లిదండ్రులు

బొంరాస్‌పేట: జిల్లా కేంద్రంలో నిర్వహించే అలింకో క్యాంపునకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల పేర్లను మంగళవారం నమోదు చేశారు. 25మంది వినికిడిలోపం, పర్పుల్ పాలసీ, వివిధ లోపాలున్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, పేర్లను నమోదు చేశారు. ఇందులో ఐ కోఆర్డినేటర్ రజనికుమార్, ప్రతికో ఉపాధ్యాయుడు వేణుగోపాల్ ఉన్నారు.

వైకల్య నిర్ధారణ పరీక్షలకు తరలిన విద్యార్థులు


తల్లిదండ్రులతో వెళ్తున్న విద్యార్థులు

దుద్యాల్ : సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వికలాంగుల విద్యార్థుల నిర్ధారణ కోసం ఏఎల్ఐఎంసీఓ కంపెనీ వారు వికారాబాద్‌లో నిర్వహించిన క్యాంపు మండలానికి చెందిన 14 మంది విద్యార్థులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కంపెనీ ఐఈఆర్పీ రాం శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ.. మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో వైకల్య లక్షణాలు ఉన్న విద్యార్థులను గతంలో గుర్తించామన్నారు. వికలత్వ పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి ఎలాంటి పరికరాలు అవసరమో అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజా గ్రామస్తులు రాములు, విద్యార్థులు ఉన్నారు.

నిరుపయోగంగా షెడ్లు


పోశమ్మ తండాలో నిర్మించిన షెడ్డు

కొడంగల్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా గ్రామాలకు దూరంగా నిర్మించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఒక్కో షెడ్డుకు రూ.రెండున్నర లక్షలు వెచ్చించి నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను షెడ్ల వద్దకు తెచ్చి వేరు చేయాల్సి ఉంది. తడిపొడి చెత్తను వాటి కోసం నిర్మించిన షెడ్లలో వేయాలి. గాజు బాటిల్స్, ప్లాస్టిక్ బాటిల్స్, చెప్పులు, పేపర్ అట్ట ముక్కలు, బల్బులు, ఎలక్ట్రికల్ వస్తువులు, బ్యాగులు, బట్టలు ఇతర వ్యర్థ పదార్థాలను వేరు చేయాలి. అయితే, మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గిరిజనులను చదివించాలి


పాఠశాలను సందర్శించిన బాబురావు చౌహాన్

కుల్కచర్ల: గిరిజన చిన్నారులను తప్పనిసరిగా చదివించాలని అఖిల భారత బంజార సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు, కర్ణాటక మాజీ మంత్రి బాబురావు చౌహాన్ అన్నారు. మంగళవారం మండలంలోని హన్మ్యానాయక్ తండా సంఘం నాయకులు చందర్ ఇటీవల అనారోగ్యానికి గురైన నేపథ్యంలో ఆయనను పరామర్శించారు. అనంతరం స్థానిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు అభివృద్ధి సాధించాలంటే తమ కుటుంబాలలోని చిన్నారులను ఉన్నతంగా చదివించడంతోనే సాధ్యమవుతుందన్నారు. తండాకు వచ్చేందుకు రహదారి ఇబ్బందికరంగా ఉండటంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవులానాయక్, చెల్లాపూర్ మాజీ సర్పంచ్ చాందిబాయి, నీల్యానాయక్, చందర్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బొంరాస్‌పేట: మండలంలోని రేగడిమైలారంలో రెండో రోజు మంగళవారం బసవన్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామవీరశైవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఉదయం అంకురార్పన, నవగ్రహారాధన, తీర్థప్రసాదాలు నిర్వహించారు. మూడోరోజు బుధవారం 108 కడవలతో రుద్రాభిషేకం, సాయంత్రం పలు అధివాసాలు, చివరిరోజు విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అందని బిల్లులు.. మాజీల అవస్థలు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా సర్పంచులు పంచాయతీ భవనాల నిర్మాణం, సీసీ రోడ్లు, క్రీడా ప్రాంగణాలు, మన ఊరు–మనబడి పనులు చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారుల ఒత్తిడితో అప్పులు చేసి మరీ పనులు పూర్తి చేశారు. బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆందోళన చెందుతున్నారు.. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

- పదవీకాలం ముగిసి ఏడు నెలలు
- మాజీ సర్పంచుల ఎదురుచూపులు
- అప్పులకు వడ్డీ చెల్లించలేక ఆందోళన


చంద్రాయన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం

మోమిన్‌పేట:నూతన పంచాయతీ భవనం,క్రీడా ప్రాంగణాలు, మన ఊరు- మనబడి, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి, పూర్తి చేసినా బిల్లులు రాక నానా అవస్థలు పడుతున్నామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల కోసం తెచ్చిన అప్పులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవి కాలం ముగిసి ఏడు నెలలు కావస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మాజీలు వాపోతున్నారు. పదవిలో ఉన్నప్పుడు అధికారులు వెంట పడి పనులు చేయించారని, బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

పంచాయతీ భవనాలు నిర్మించి ఏడాది, సీసీ రోడ్లు వేసి 2 సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికి బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులుగా ఎన్నికై న పాపానికి భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వాలు పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయలేకపోవడం శాపంగా మారిందని వారు వాపోతున్నారు. స్థానిక ఎన్నికలు జరిగితే బిల్లుల కోసం వచ్చిన పంచాయతీ పాలక వర్గాన్ని ప్రాధేయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలు 9మంజూరు కాగా, 8 భవనాలు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఒకటి నిర్మాణ దశలో ఉంది. ఒక్కో గ్రామ పంచాయతీని రూ.20లక్షలతో ప్రభుత్వం ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టింది. నిర్మించి ఎడాది కావస్తున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని మాజీలు పేర్కొంటున్నారు. మన ఊరు–మన బడి కింద 19పాఠశాలలకు నిధులు మంజూరు చేయగా 7పాఠశాలలు పూర్తి చేసి, మిగతా 12నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిని సర్పంచులే చేయాలని ఉన్నతాధికారులు పట్టు బట్టి నిర్మాణ పనులు చేయించారని అన్నారు. ఇప్పటివరకు 20శాతానికి మించి నిధులు విడుదల చేయలేదని అంటున్నారు. అదేవిధంగా గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు 42 పనులు మంజూరు చేయగా 42 పనులు పూర్తి చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3.20లక్షలు మంజూరైన నిధులు విడుదల కాలేదన్నారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు పంచాయతీకి రూ.1లక్షకు పైగానే ఖర్చు చేసినా ప్రభుత్వం ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పనులు వెంట పడి చేయించిన అధికారులు నిధుల విడుదలలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి పోతున్నారని వారికి ఏం చెప్పాలో తెలియక ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం చేసిన పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

రూ.80 లక్షలు రావాలి



మన ఊరు - మన బడి, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేశా. సుమారుగా రూ.80లక్షల వరకు రావాల్సి ఉన్నాయి. ఎంబీలు పూర్తి చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి చేసిన పనులకు ముందు పూర్తయిన తర్వాత ఫోటోలు అడుగుతున్నారు. గతంలో అడుగలేదు. ఇప్పుడు అడుగుతున్నారు. ఎలా దొరుకుతాయి ఆందోళనగా ఉంది. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి.

– బండ నవనీతరెడ్డి, మాజీ సర్పంచు టేకులపల్లి

రూ.30లక్షలకు పైనే రావాలి



గ్రామంలో నూతన పంచాయతీ భవనం, మన ఊరు- మనబడి, క్రీడ ప్రాంగణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ తదితర పనులను పూర్తి చేశా. రూ.30లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఎంబీలు పూర్తి చేశారు. డబ్బులు మాత్రం రావడం లేదు. అప్పులు కుప్పలయ్యాయి. సర్పంచుగా ఎన్నికైనందుకు సంతోషించాలో.. భూములు అమ్ముకోవాల్సి వస్తుందని ఎడవాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులను విడుదల చేయాలి.

– అంజయ్య, మాజీ సర్పంచు చంద్రాయన్‌పల్లి

దేవాలయ భూములను కాపాడండి

బీజేపీ నాయకుడు శేరిరాంరెడ్డి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

దోమ: సంజీవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని దొంగఎన్కేపల్లి గ్రామంలో వెలసిన సంజీవస్వామి దేవాలయానికి పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా వందల ఎకరాల భూములు ఉన్నాయి. కొందరు రియల్టర్లు, ఆయా పార్టీల నేతలు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అన్యాక్రాంతమైన భూములను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే, దొంగ ఎన్కేపల్లి గ్రామ పేరును సంజీవనగర్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు ఆంజనేయులు, నర్సింహులు, నాగేంద్రం, చెన్నయ్య, తిరుపతయ్య, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ఆ సంస్థలపై విచారణ జరిపించాలి


పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్ : శ్రీ చైతన్య విద్యా సంస్థల అవినీతిపై ఈడీ, సీబీఐతో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాండూరులోని పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల అధిక ఫీజుల వసూళ్లు తారస్థాయికి చేరాయన్నారు. సరైన మైదానం, ఫైర్ సేఫ్టీ, అర్హత గల ఉపాధ్యాయులు, విద్యాశాఖ నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదని మండిపడ్డారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నవీన్, కళ్యాణ్, సాయికుమార్, భాను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పార్టీ నేత మారుతీ కిరణ్ బూనేటి


పుస్తకం అందజేస్తున్న తరుణ్ చుగ్

పరిగి : బీజేపీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని పరిగి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతీ కిరణ్ బూనేటి అన్నారు. మంగళవారం బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్ చుగ్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిగి రాజకీయాలపై ఇరువురు చర్చించి, పార్టీ పటిష్టతకు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలను సమన్వయ పర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. బూత్ లెవల్‌లో ప్రతి కార్యకర్తను ప్రజల్లో ఉంచుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించేలా కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు అందించిన పాలనపై జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ రాసిన పుస్తకాన్ని మారుతి కిరణ్ బూనేటికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి


కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న దివ్యాంగులు

దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్

పరిగి : దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ అన్నారు. మంగళవారం పట్టణంలో భారత దివ్యాంగుల పరిరక్షణ సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేట్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించి, వారికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిగిలో దివ్యాంగుల భవనాన్ని నిర్మించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిగి మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య, వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, నర్సింహులు, లక్ష్మయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవితకు బెయిల్‌పై హర్షం

డాక్టర్ మెతుకు ఆనంద్


స్వీట్లు తినిపించుకుంటున్న మెతుకు ఆనంద్ తదితరులు

అనంతగిరి: ఎమ్మెల్సీ కవితకు సుప్రీంలో బెయిల్ మంజూరుపై వికారాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకుఆనంద్ నివాసం వద్ద నాయకులు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, సీనియర్ నాయకులు పాండు, శేఖర్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై అధికారుల సీరియస్

లైన్‌మెన్‌పై శాఖా పరమైన చర్యలకు సిద్ధం


విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

నవాబుపేట: మైతాప్‌ఖాన్‌గూడ గ్రామంలో చెట్లను నరికిన ఘటనపై అధికారులు స్పందించారు. గత రెండు రోజుల క్రితం విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను పూర్తిగా నరికివేశారు. ఈ విషయం పలు పత్రికల్లో ప్రచురితమైంది. దీంతో మంగళవారం ఎంపీడీఓ అనురాధ, విద్యుత్ ఏఈ ప్రమోద్‌లు గ్రామాన్ని సందర్శించి చెట్ల నరికివేతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విద్యుత్ లైన్‌మెన్ శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలితే కొమ్మలను తొలగించాలే కాని, చెట్ల మొదలను ఎలా నరికి వేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారికి, కార్యదర్శికి సమాచారం ఇవ్వకుండా ఎలా చెట్ల తొలగిస్తారని అన్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈ ప్రమోద్‌ని ఆదేశించారు. స్పందించిన ఏఈ విద్యుత్ లైన్‌మెన్ శంకర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకొని, చెట్లను నరికిన స్థానంలో అతనితోనే(లైన్‌మెన్‌తో) మళ్లీచెట్లు నాటిస్తామని హామీ ఇచ్చారు.

నేడు పల్లకీ సేవ, పెరుగు బసంతం

కొడంగల్ : పట్టణంలోని కేశవస్వామి ఆలయంలో బుధవారం ఉ.8 గంటలకు పల్లకీ సేవ ఊరేగింపు, పెరుగు బసంతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మురహరి వశిష్ట మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా బుధవారం ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సా.6 గంటలకు స్వామివారు ఆలయం నుంచి తన స్వస్థలమైన శ్రీహరి వశిష్ట ఇంటికి ఊరేగింపుగా వెళ్తారని తెలిపారు.

మా గ్రామంలో మద్యం అమ్మొద్దు


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని గోధుమగూడలో మద్యపానం నిషేధించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు పెద్దలు మంగళవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్న దుకాణాల్లో అమ్మకాలు బంద్ చేయాలన్నారు. గ్రామస్తులంతా కలిసి తీర్మానం చేసుకున్నామన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్తయ్యగౌడ్, తుకారాం, యాదయ్య, మైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేయండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్, మహిళలు

తాండూరు టౌన్ : పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి చెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేయాలని 24వ వార్డు బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత, స్థానిక మహిళలతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏటా ఆరు వార్డులకు చెందిన మహిళలు పెద్దఎత్తున బతుకమ్మను మల్‌రెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేస్తుంటారన్నారు. అక్కడ ఘాట్ లేకపోవడంతో నిమజ్జనం ఇబ్బందిగా మారిందన్నారు. బతుకమ్మ పండగలోపు ఘాట్‌ను నిర్మించాలని కోరారు. అలాగే, శివాజీచౌక్ నుంచి మల్‌రెడ్డిపల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, సీసీ రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా ఘాట్ నిర్మాణం చేపడతామని, సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపడుతామని కౌన్సిలర్ హామీ ఇచ్చారు.

ఎస్‌బీఐ ఎదుట రైతుల ధర్నా


బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- విధులకు వచ్చినా కనిపించని ఫీల్డ్ ఆఫీసర్
- కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నదాతల ఆందోళన

ధారూరు: ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ధారూరు ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని మంగళవారం రైతులు బ్యాంక్ ఎదుట ధర్నాకు దిగారు. బ్యాంక్ అధికారులు తాము తీసుకున్న రుణాన్ని రెన్యూవల్ చేయకుండా 15 రోజులుగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఫీల్డ్ ఆఫీసర్ విధుల్లో ఉన్నా రైతులకు కనపడకుండా బ్యాంకు లోపలే పనులు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాఫీ విషయం బ్యాంక్ మేనేజర్ దృష్టికి తీసుకురాగా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. రుణాన్ని బ్యాంక్ అధికారులు ఎలాంటి షరతులు లేకుండా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలిచ్చిన బ్యాంక్ అధికారులు బేఖాతరు చేస్తున్నారని మండిపడ్డారు. రెన్యువల్ చేయడానికి దరఖాస్తులివ్వండని చెప్పారని, తీరా దరఖాస్తులిచ్చాక ముఖం చాటేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చొరవ తీసుకుని రుణాలను రెన్యువల్ చేయాలని, లేదా ప్రభుత్వం మాఫీ చేసిన రుణాన్ని తమ ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. కొంతమంది రైతులు హైదరాబాద్ ప్రధాన బ్యాంకు కార్యాలయంలో ఉన్న చీఫ్ మేనేజర్ బామన్‌సింగ్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించండి

తహసీల్దార్ కిషన్


బంట్వారం: మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దేముల్: ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ కిషన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. వారికి మాస్టర్ ట్రైనర్లు రాములు, లక్ష్మయ్యలు ఓటరు జాబితాపై పూర్తి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం 01-01-2025 నాటికి ఓటర్లుగా నమోదు అర్హత గల యువతకు ఓటు హక్కు కల్పించేలా బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. బీఎల్ఓలు 18-10-2024 వరకు తమకు కేటాయించిన నివాసాల్లో ఇంటింటా సర్వే చేసి రిజిష్టర్ నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం జాబితాలో మార్పులు అవసరం అయితే చేయడం, నూతన ఓటరు నమోదు, వలస ఓటర్లను గుర్తించి సవరణ ప్రతిపాదించడం, పోలింగ్ స్టేషన్ హేతుబద్ధీకరణకు ప్రతిపాదించడంతో పాటు శిక్షణలో ఇచ్చిన పూర్తి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు.

ఓటరు నమోదు పక్కాగా ఉండాలి

బంట్వారం: ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పులు సరిచేయడం, పేర్లు తొలగింపు, కొత్తగా ఓటరు నమోదు వేగవంతం చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ ,యువకులు తప్పనిసరిగా ఓటరు లిస్టులో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు లిస్టును చెక్ చేయాలని సూచించారు. గడువులోపు ఓటరు నమోదు ప్రక్రియ , ఇతర సవరణలు పూర్తి చేయాలని చెప్పారు. ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీటీ మహేశ్, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.


పెద్దేముల్: బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్న రాములు